ఎన్నికల నియమావళి పాటించాల్సిందే

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ

విశాలాంధ్ర - పెందుర్తి: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాల్సిందేనని పెందుర్తి నియోజకవర్గం ఎన్నికల అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ తెలిపారు. పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ షెడ్యూల్ విడుదలైన తర్వాత సబ్బవరంలో టీడీపీ ఎలాంటి అనుమతి తీసుకోకుండా ర్యాలీ నిర్వహిం చినందున ఆ పార్టీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పెందుర్తిలో వైసీపీ బైక్ ర్యాలీ నిర్వహణకు అనుమతి తీసుకుని మైక్ సిస్టం వినియోగించడంతో ఆ పార్టీపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు నిబంధనావళి అమలులో ఉంటుందని అందరూ పూర్తిగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రోడ్డుపై ఫ్లెక్సీలు తొలగింపు విగ్రహాలకు ముసుగులు వేయడం ఇళ్లపై ఉన్న ఫ్లెక్సీలను తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని కలసిన బెహర

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని అధిష్టానం ప్రకటించిన సందర్భంగా ఆదివారం ఆమె నివాసంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పుష్పగుచ్ఛమిచ్చి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గునిశెట్టి శ్రీనివాసరావును బొత్స ఝాన్సీ అభినందించారు. పిదప ఇటీవల ప్రమాదంలో కాలుకి దెబ్బ తగిలి బెహరా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బల్ల రమణ కుమారుడు మౌళిని, నమ్మి రమణ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పరామర్శించి తొందరలోనే కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ పునరుద్ధరించాలి

అభివృద్ధిలో స్థానికులను భాగస్వామ్యం చేయాలి
ఆచార్య కెఎస్ చలం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: 2014 చట్టంలోని 46(3) ప్రకారం ఉత్తర తీర ఆంధ్ర అంటే ఉత్తరాంధ్ర అయిన శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నంలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ పునరుద్ధరించాలని యూపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ కెఎస్ చలం డిమాండ్ చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలను పునర్వ్యవస్థీకరించి 6 జిల్లాలుగా ఉత్తరాంధ్ర రూపొంది, గోదావరి వరకు సాగిందన్నారు. ఈ ఆరు జిల్లాలు మూడు ప్రధాన భాగాలుగా ఆదివాసి, తీర, మైదాన ప్రాంతాలు అని, విశాఖపట్నం ఈ ప్రాంత చారిత్రక, ఆర్థిక, సామాజిక, సంస్కృతి కేంద్రంగా వుందన్నారు. యిప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు మూడింట ఒకవంతు రాష్ట్ర ఆదాయాన్ని సమకూరుస్తున్నది విశాఖ అని, యిక్కడ వున్న దళిత, ఆదివాసి, వెనుక బడిన జనాభా 90 శాతంగా వున్నారన్నారు. వారి జీవితాల్లో మార్పు లేదన్నారు. ఈ ప్రాంత దోపిడీ పెరగటంతో మిగతా ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. అందుకే ఈ క్రింది అంశాలను ప్రభుత్వం, రాజకీయ పార్టీల దృష్టికి తెస్తున్నామన్నారు. అభివృద్ధి అంతా విశాఖ నగరానికి పరిమితం చేయటానికి ప్రధానంగా యిక్కడి భూములు 1948 జామిందారి రద్దు తరువాత ప్రభుత్వ భూములవటంతో మిగతా ప్రాంతాల నుండి వచ్చిన స్థానికేతరులు ఈ వనరులు కొల్లగొట్టి, స్థానిక ప్రజలను వారి సంస్కృతిని పక్కకు నెట్టేశారన్నారు. విశాఖ మొత్తం వ్యాపారమయం అయిందన్నారు. జీవిఎంసీ, వియంఆర్‌డిఏ ప్రణాళిక ఏవిదంగాను పౌరుల అవసరాలు కాకుండా రియల్ ఎస్టేట్‌కు ఉపయోగ పడేలా వుందన్నారు. విశాఖ ఉక్కు తెలుగు జాతి హక్కు అని, ఉత్తరాంధ్ర జీవనాధారమని, దాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రధాని మోడీ ప్రత్యేక ప్రకటన చేయాలని ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్.ఎస్.శివశంకర్ కోరారు. జర్నలిస్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అన్ని రంగాలలో సామాజిక వెనుకబాటుతనం 70 శాతం ఉందని వ్యవసాయం, పరిశ్రమల రంగానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. సమావేశంలో అరసం కార్యదర్శి యు.అప్పలరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత హోమియో మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర - భీమిలి: కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70వ ఉచిత హోమియో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో 95 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు అందజేసినట్టు ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి.జగన్నాథరావు, టిజె మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కె.చంద్ర శేఖర్, కేవీ భానోజీరావు, కే.శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణరావు, వి.శ్రీనివాసరావు, వి.రాంబాబు, ఎం.శంకర్, గంధ రాము, దివ్య, పాల్గొన్నారు.

మామిడిలోవలో వైసీపీ ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం: శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరలా వైసీపీ తరఫున భీమిలిలో పోటీ చేస్తున్నందున ప్రచారాన్ని ప్రారంభించారు. ఆనందపురం మండలం మామిడిలవ గ్రామంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి అనంతరం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మామిడిలోవ నాయకులు బలిరెడ్డి మహేష్ ఏర్పాటు చేసిన తీన్మార్ కార్యక్రమంతో గ్రామంలోని ప్రచార యాత్ర చేపట్టారు. అనంతరం దెబ్బమీదపాలెం వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో ఆనందపురం మండలం అంటే మంచి అభిమానం ఉందని ఎన్నికల ప్రచారంలో మండలంలోని మామిడిలోవ నుండి ప్రారంభించడం శుభ పరిణామంగా భావించి ప్రచార కార్యక్రమం చేపడుతు న్నామన్నారు. 2024 ఎన్నికల్లో మరల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గంలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ వెంకట్రావు, బంక సత్యనారాయణ, మణిశంకర్ నాయుడు, జి.శ్రీనివాస్, బలిరెడ్డి మహేష్, రమేష్, పాండ్రంకి శ్రీను, పినిశెట్టి సింహాచలం నాయుడు, కోరాడ ముసలి నాయుడు, లంక రాంబాబు, ఇల్లాపు వెంకట జగన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తిలో లీగల్ డ్రాఫ్టింగ్ కీలకం

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

విశాలాంధ్ర - మధురవాడ: న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే యువత లీగల్ డ్రాఫ్టింగ్‌పై పట్టు సాధించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతిభావంతమైన కేసు రచన సరళమైన భాషతో చెప్పదలచుకున్న విషయాలను తగిన ఆధారాలతో ఉండాలన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్ లోని బలమైన అంశాలకు న్యాయస్థానాలలో ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో ఆయన ఉదాహరణ సహితంగా వివరించారు. వివిధ రకాల లీగల్ డ్రాఫ్టింగ్ పద్ధతులను ఆయన తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. గీతం న్యాయ విద్యా కోర్సుల బోధనా విధానం అత్యుత్తమంగా ఉందని అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ కేసులలో కక్షిదారులకు సరైన న్యాయం జరగాలంటే డ్రాఫ్టింగ్ లోపాలు ఉండకూడదని, చట్టాలు, వివిధ తీర్పుల పట్ల లోతైన అవగాహన, పరిశీలన అవసరం అన్నారు. గీతం న్యాయ కళాశాల లీగల్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలకు సహితం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ముద్రగడను కలిసిన గోవింద్ పట్నాయక్

విశాలాంధ్ర - పెందుర్తి: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యే తోట నరసింహంలను వైయస్సార్ ట్రేడ్ యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు పట్నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైసీపీలో చేరిన ముద్రగడ పద్మనాభంతో సమావేశమై తాజా రాజకీయాలపై చర్చించినట్లు పట్నాయక్ మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభంజనం తదితర అంశాలపై ముద్రగడ తనతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - పద్మనాభం: ఈ ఏడాది 2023- 24 విద్యా సంవత్సరంలో మొదటి రోజు 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని రెడ్డిపల్లి, పద్మనాభం, మద్ది, రేవిడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన పరీక్షలకు 702 మంది విద్యార్థులకు గాను 701 మంది పాల్గొని పరీక్షలు రాశారు. ఈ పరీక్షా కేంద్రాలను పద్మనాభం తహశీల్దార్ వెంకటరావు మద్ది పద్మనాభం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఎంఈఓ పి.రమణ రెడ్డిపల్లి పద్మనాభం పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల ఆవరణలో రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను రేవిడి వైద్యాధికారిని స్వప్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

సివిల్ సప్లయ్ హమాలీల పనులకు భద్రత కల్పించాలి

సివిల్ సప్లై హమాలీల యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు

విశాలాంధ్ర - విశాఖ: సివిల్ సప్లయ్ హమాలీల పనులకు భద్రత కల్పించాలని సివిల్ సప్లై హమాలీల యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలో ఉన్న సివిల్ సప్లయ్ గొడౌన్స్ వద్ద ఆహార ధాన్యాలు ఎగుమతి, దిగుమతి చేస్తున్న హమాలీలు పనులు నిలిపివేసి ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయ్ హమాలిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మర్రిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ నుండి గత అనేక సంవత్సరాలుగా.. పౌర సరఫరాల సంస్థ ప్రారంభం నుండి ఎండాడ, మధురవాడ తదితర ప్రాంతాల్లో ఉన్న రేషన్ షాపులకు బియ్యం తీసుకువెళ్లి అన్ లోడింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు ఈ పాయింట్ నుండి ఆ ఏరియాలో ఉన్న రేషన్ షాపులకు కేంద్ర ప్రభుత్వం రూట్ మ్యాప్ ప్రకారం వెళ్ళడానికి వీలులేదని చెబుతున్నారని, దీని వల్ల సుమారు వెయ్యి టన్నులు పని హమాలీలకు లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికే నెల అంతా గోడౌన్ ను నమ్ముకుని పని చేస్తున్నప్పటికీ హమాలీలకు వస్తున్న ఆదాయం వారి కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోక నానా అవస్థలు పడుతూ జీవన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొత్త ప్రతిపాదనల వల్ల హమాలీలకు వస్తున్న ఆదాయం మరింత తగ్గి అవస్థలు పడతారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలు విడిపోయిన సందర్భంలో ఒక మండలంలో ఉన్న రేషన్ షాపులను వేరే మండలాలకు కలవడం జరిగిందని తెలిపారు. దీని వల్ల హమాలీలు చాలా ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. అందువల్ల ఇలాంటి ప్రతిపాదనలను రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మానుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. సివిల్ సప్లయ్ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీలు గత అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ని నిర్వీర్యం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కార్పొరేషన్ నిధులను పూర్తిగా ఖాళీ చేసిందని, రేషన్ డిపోలకు వెళ్లి ప్రజలు సరుకులు తీసుకొని వెళ్లడం సులువుగా ఉండేదని, ఇప్పుడు రేషన్ వెహికల్ ఎప్పుడు వస్తుందా? అని ప్రజల ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. హమాలీలు అందరికీ ఎగుమతి, దిగుమతి కూలి రేట్లు పెంచుతూ వెంటనే అగ్రిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు పనికి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లాలోని ఆరు మండల పాయింట్ల పరిధిలో ఉన్న హమాలీలు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సిహెచ్ కాసుబాబు, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ అధ్యక్షులు పి. అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ప్రసాదు ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సన్యాసినాయుడు, పోతురాజు, నూకరాజు, జోగి నాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్జీ ద్రోణాచార్య స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పిల్లలలో దాగి ఉన్న సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఫిట్జీ ద్రోణాచార్య స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఫిట్జీ డైరెక్టర్ అర్.ఎల్.త్రిఖా తెలిపారు. ఫిట్జీ ద్రోణాచార్య పరీక్షను ఏప్రిల్ ఏడవ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. ఆరో తరగతి నుంచి ప్లస్ టు విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావచ్చన్నారు. 6, 7, 8వ తరగతి విద్యార్థులకి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.750 ఉంటుందన్నారు. తొమ్మిదో తరగతి నుంచి ప్లస్ టు విద్యార్థులకు రూ.1500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఈ ఫీజుపై 99 శాతం వరకు ఫీజు మినహాయింపు రూపంలో ప్రోత్సాహకాలను కూడా పొందవచ్చునని, మరింత సమాచారం కోసం https://dronacharyaexam.fiitjee.com/registration-process.htmlని చూడాలని కోరారు. పరీక్ష కోసం నమోదు చేసుకోవడానికి ఏప్రిల్ 5 ఆఖరు తేది అన్నారు. విద్యార్థులు www.fiit-jee.com /dronacharya వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా లేదా ఏదైనా ఫిట్జీ కేంద్రాన్ని సందర్శించాలని కోరారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకి ప్రత్యేక విధానం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకి వర్సిటీలో ప్రత్యేక విధానం అవలంబిస్తున్నట్టు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి తెలిపారు. గ్లోబల్ రీ సైక్లింగ్ డేని పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో వ్యర్థాల నిర్వహణ సైతం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. విభిన్న రూపాలలో నిత్యం మనం చూస్తున్న వ్యర్థాలకు ఒక ప్రత్యేక విధానంలో రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో వీటిపై విస్తృత అవగాహన పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తీర్చిదిద్దిన ప్లకార్డులను చూసి అభినందించారు. పుడమిని పరిరక్షిం చుకోవడంలో వ్యర్థాల సమర్థ నిర్వహణ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని అవలంబించడం జరుగుతుందన్నారు. వర్సిటీలో ఏర్పడే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రత్యేక విధానంలో సేకరించడం జరుగుతుందన్నారు. దీనిని నగరానికి చెందిన ఎంఎస్ఎంఈ ఎలక్ట్రో ప్రో సంస్థ సహకారంతో శాస్త్రీయ విధానంలో వీటిని రీసైకిల్ చేయడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగిం చడంతో పాటు వాటిని రీసైకిల్ చేసే విధంగా సహకారం అందించడం సైతం మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య డి.నాగ రాజ కుమారి, విభాగ బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంకు చెందిన ఒక్క అడుగు కూడా అన్యాక్రాంతం కానివ్వం

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంకు చెందిన మూతపడిన క్యాంటీన్‌ను తెరవాలని, దేవస్థానంకు చెందిన స్థలంకు అద్దె చెల్లించకుండా వివాహాది శుభ కార్యాలయాలకు అద్దెలకు ఇచ్చి దేవస్థానముకు వచ్చే ఆదాయాన్ని గండి కొడుతున్నారని 98వ వార్డుకు చెందిన లోగీశ గణేష్ అనే భక్తుడు ఈనెల 4వ తేదీన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెండు క్యాంటీన్‌లకు బహిరంగ వేలం నిర్వహించగా ఒకటి మాత్రమే వినియోగంలో ఉంది. రెండవ క్యాంటీన్‌ను గత కొన్నేళ్లుగా ఉద్దేశపూర్వకంగానే మూసి వేసినట్టు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో దేవస్థానం లీజెస్ విభాగం అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే ఈ విషయపై లీజెస్ విభాగం పర్యవేక్షణాధికారిని వివరణ కోరగా రెండవ క్యాంటీన్‌కు మరమ్మతులు జరిపి అప్పగించాలని లేకుంటే దేవస్థానం స్వాధీనం చేసుకుంటుందని గుత్తేదారునికి సూచనలు చేశామని అన్నారు. స్పందనపై దేవస్థానంకు చెందిన ఏఈఓ, ఈఈలు సర్వేయర్‌లు దేవస్థానం హద్దులు నిర్ణయించారు. దేవస్థానంకు చెందిన ఒక్క అడుగు కూడా అన్యాక్రాంతం కానివ్వమని, రికార్డు చేసిన సమాచారం కార్యనిర్వహణాధికారి, కలెక్టర్ వారికి అందజేస్తామని వారన్నారు.

ప్రతి వాలంటీరు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రతి జాతీయ సేవా పథకం వాలంటీర్ జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనడానికి తగిన అర్హతను సంపాదించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఇందిరా కాలనీలో నిర్వహిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథక యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో సోమవారం ఆమె మాట్లాడారు. జాతీయ సేవా పథకంలో ఎన్నో జాతీయ స్థాయి అవకాశాలు ఉన్నాయని, వాటిని యువత అందిపుచ్చుకోవాలని అన్నారు. ఇందిరా కాలనీలో 50 మంది వాలంటీర్లు ఇంటింటి సర్వే చేసి వ్యక్తిగత, సామాజిక సమస్యలను గుర్తించారు. అనంతరం యూనిట్ - 2 ఆధ్వర్యంలో బర్మా కాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాన్ని సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి సందర్శించారు. కార్యక్రమంలో యూనిట్-1 ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి, యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి నదియా పాల్గొన్నారు.

తేలని గంటా పంచాయితీ...!

భీమిలి కోసమే పట్టు
ఒకటి రెండు రోజుల్లో కూటమి అభ్యర్థుల పెండింగ్ జాబితా విడుదల

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీలో అభ్యర్థుల జాబితా పూర్తిగా ప్రకటించినప్పటికీ తెలుగుదేశం పార్టీలో మరో 16 స్థానాలకు అభ్యర్థులు ప్రకటించకపోవడంతో ఇంకా గందరగోళ పరిస్థితి నెలకొంది. అందులో విశాఖ జిల్లాలో భీమిలి నియోజకవర్గం పెండింగ్‌లో ఉండటంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి ప్రకటన లేకపోవడంతో వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ ప్రచారాన్ని ఇప్పటికే ప్రారంభించి ప్రజల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. టిడిపి జనసేన వర్గాల్లో ఇంకా అభ్యర్థి తేలక పోవడంతో, కూటమిలో వర్గ పోరు కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొన్నాయి. అయితే ఈసారి ఎన్నికల్లో తొలి నుండి భీమిలి నియోజకవర్గం లో తనకు టిక్కెట్ ఇవ్వాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పట్టుపట్టారు. టిడిపి అధినేత చంద్రబాబు ఈసారి గంటా ను విజయనగరం జిల్లా చీపురుపల్లి కు వెళ్లి బొత్స పై పోటీ చేయాలని ఇప్పటికే పలుమార్లు చెప్పినప్పటికీ ససేమిరా అన్న గంటా భీమిలి కోసమే పట్టుబడుతున్నారు. జనసేన బిజెపి పొత్తులో భాగంగా టిడిపి ఎప్పటి వరకు తొలి విడుదల 94 సీట్లు ప్రకటించగా, రెండో విడతలో 34 సీట్లను ప్రకటించింది. మరో పదహారు స్థానాలకు అభ్యర్థులు ప్రకటన జరగకపోవడంతో ఆయా నియోజకవర్గాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అటు చీపురుపల్లి, ఎచ్చెర్ల, భీమిలి నియోజకవర్గం అభ్యర్థుల ప్రకటన జరగలేదు. విశాఖ నగరానికి, జిల్లాకు ఆయువుపట్టుగా ఉన్న భీమిలి నియోజకవర్గం మే రానున్న ఐదేళ్లలో మరింత కీలకం కానున్న నేపథ్యంలో గంటా భీమిలిపైనే కన్నేశారు. ఈ నియోజకవర్గంలో టిడిపి నుండి కోరాడ రాజబాబు, జనసేన నుండి పంచకర్ల సందీప్ కుమార్ టికెట్లు కోసం తీవ్రంగానే శ్రమిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత హార్ట్ కేక్ లా ఉన్న భీమిలి నియోజకవర్గం లో సరైన వారిని దింపాలని కూటమి భావించినట్లు తెలుస్తుంది.

ఆఖరి నిమిషంలో వైసిపి కూడా వేరొకరికి భీమిలి సీటు ఇస్తుందని ప్రచారం సాగింది. అయినప్పటికీ అభ్యర్థుల ప్రకటనలో సిట్టింగ్ ఎమ్మెల్యేకే మళ్లీ భీమిలి స్థానం వైసీపీ కట్టబెట్టడంతో భీమిలి తనకే కావాలని గంటా పట్టుపట్టారని సీనియర్ నేతలు అంటున్నారు. అధినేత చంద్రబాబుపై గంటా వియ్యంకుడు మాజీ మంత్రి నారాయణతో, సినీ నటుడు చిరంజీవితో, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాగేంద్రబాబు తో సిఫార్సు చేయించి టికెట్ కోసం తీవ్రంగానే బాబుపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. అయితే ఒకటి రెండు రోజుల్లో టిడిపి పెండింగ్లో ఉన్న 16 సీట్లపై ప్రకటన చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో భీమిలి పంచాయతీకి తెరపడనుందని ప్రచారం సాగుతుంది.

స్వతంత్ర అభ్యర్థి నాగోతు ప్రచారం

విశాలాంధ్ర-సింహాచలం: భీమిలి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి నాగోతు నాగమణి సింహాచలం పరిసర ప్రాంతాల్లో ప్రచారం ప్రారంభించారు. భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి అయిన తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక వ్యక్తిని గెలిపించుకుంటే ఈ నియోజకవర్గంలో ఉండే అన్ని సమస్యలు తీర్చుకోవచ్చన్నారు. తనను గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటాను అన్నారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం రాజకీయ పార్టీ అభ్యర్థులకు ఏమాత్రం తీసిపోరని వారు ఓటుకు నోట్లు ఇస్తారని తాము మాత్రం ఎలాంటి నోట్లు పంచమని అన్నారు. ఓటు తనకు వేస్తే రాబోయే రోజుల్లో ప్రశ్నించే హక్కు అధికారం మీకు ఉంటుందని అదే నోటు తీసుకొని ఓటు వేస్తే ఎదుటి వ్యక్తిని ప్రశ్నించే అధికారం హక్కు మీరు కోల్పోతారని ఓటర్లకు వివరించారు. అదేవిధంగా మేము గెలిస్తే మహిళలకు ఉద్యోగ భద్రత కలిగిస్తామని, గ్రామాల్లో ఉన్న ప్రతి చిన్న సమస్య ను పరిష్కరిస్తామని అన్నారు. పచ్చ నోటుకు మీ ఓటును అమ్ముకోకూడదని విద్యార్థులు, యువత సైతం ప్రజలను మేలుకొల్పాలని ఆమె సూచించారు. తాను తన సందేశ రూపంలో ప్రజలకు వివరించారు.

మత్స్యకారులకు అండగా టీడీపీ

విశాలాంధ్ర - భీమిలి: మత్స్యకారులను అక్కున చేర్చుకొని వారికి అన్ని విధాలుగా అండగా ఉండేది టీడీపీయేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం భీమిలి జోన్ 3వ వార్డు మత్స్యకారుల గ్రామం తోటవీధిలో గంటా నూకరాజు సమ క్షంలో నిర్వహించారు. 50 సంవత్సరాలకే ఫించన్ ఇచ్చిన ఘనత టిడిపి దేనని అన్నారు. మత్స్యకారులకు వలలు, తెప్పలు, ఫైబర్ బోట్లు, ఇంజన్లు 50 శాతం సబ్సిడీపై ఇచ్చిన చరిత్ర టీడీపీదేనని అన్నారు. సముద్రంలో మత్స్యకారులు ప్రమాదవశాత్తు చనిపోతే భీమా సొమ్ము కాలయాపన లేకుండా అందించడంలో టిడిపి ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఇదే కాకుండా బిసి కార్పొరేషన్ ద్వారా, మత్స్యకార కార్పొరేషన్ ద్వారా మత్స్యకార యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో టిడిపి రూటే సెపరేట్ అని అన్నారు. అందుకే రాష్ట్రం భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి సమాయత్తం అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు చురకల రమణ, అర్షపాకల గురునాదరావు, నాయకులు బొడ్డు రమేష్, వాడమొదలు రాంబాబు, కారి పరదేశి, లక్ష్మణరావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

హాయర్ ఇండియా సరికొత్త ఉత్పత్తులు ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 15 ఏళ్ల నుంచి వరుసగా గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్‌లో నెం.1గా ఉన్న కంపెనీ హాయర్ అప్లయన్సెస్ ఎన్నో నాణ్యమైన అద్భుతమైన ఉత్పత్తులను భారతీయ మార్కెట్ కు అందించిందని హాయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్.ఎస్.సతీష్ వెల్లడించారు. హాయర్ అప్లయన్సెస్ ఇప్పుడు తన 20వ వార్షికోత్సవం సందర్భంగా 'మేక్ ఇన్ ఇండియా' 'మేడ్ ఫర్ ఇండియా' అనే కోణంలో సరికొత్త ఉత్పత్తులను లాంచ్ చేసిందన్నారు. ఇందులో ఓఎల్ఈడి, క్యూఎల్ఈడి టీవీలు, సూపర్ హెవీ డ్యూటీ ఎయిర్ కండీషనర్ సిరీస్, కినొచి బ్లాక్ ఎయిర్ కండీషనర్, వోగ్ స్మార్ట్ కన్వర్టిబుల్ రిఫ్రిజిరేటర్లు, వాషర్ డ్రైయర్ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్, కమర్షియల్ రిఫ్రిజిరేషన్ సొల్యూషన్ లు, వాణిజ్య ఎయిర్ కండిషనర్లు ఉన్నాయన్నారు. దీనిద్వారా హాయర్ ఇండియా తన ఉత్పత్తులను మరింతగా విస్తరించినట్లు అయ్యిందన్నారు.

టైగర్ ట్రయంఫ్ వ్యాయామం-24 ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారతదేశం, యుఎస్ మధ్య స్థాపించబడిన భాగస్వామ్యానికి అనుగుణంగా, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక ట్రై-సర్వీసెస్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ వ్యాయామం, టైగర్ ట్రయంఫ్-24ను ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఇండియన్ నేవీ సమగ్ర హెలికాప్టర్లు మరియు ల్యాండింగ్ క్రాఫ్ట్‌లతో కూడిన నౌకలు, ఇండియన్ నేవీ ఎయిర్‌క్రాఫ్ట్, ఇండియన్ ఆర్మీ సిబ్బంది, వాహనాలు మరియు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్‌లతో పాటు ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్ ఈ వ్యాయామంలో పాల్గొంటాయి. రెండు నౌకాదళాల సిబ్బంది శిక్షణ సందర్శనలు, విషయ నిపుణుల మార్పిడి, క్రీడలు, సామాజిక పరస్పర చర్యలలో పాల్గొంటారు. నౌకాశ్రయం దశ పూర్తయిన తర్వాత నౌకలు, దళాలతో బయలుదేరి, సముద్ర దశకు ప్రయాణించి, ఇంజెక్ట్ చేయబడిన పరిస్థితులకు అనుగుణంగా మారిటైమ్, యాంఫిబియస్ కార్యకలాపాలను చేపట్టాయి.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం : పరిశ్రమలలో జరుగు పనులు నందు ఉపాధి అవకాశాలు కల్పించి యువత భవిష్యత్తుకు గ్యారెంటీనిచ్చేందుకు వి ఐ సి ఎల్ యు యూనియన్ అడుగులు వేస్తుంది అని తెలుగుదేశం పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాండ్రంగి అప్పలరాజు అన్నారు. టీఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దేవర అప్పలరాజు, నరేంద్ర, కోన అప్పల రాజు, త్రినాద్, శ్రీనివాస్, ప్రసాదుల రాము, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో మొత్తంగా 5 కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలు 4, ప్రైవేట్ పాఠశాల ఒకటి అందులో జడ్పీహెచ్ఎస్ ఆనందపురం సెంటర్ 240 మంది, బి సెంటర్ నందు 220 మంది, జడ్.పి.హెచ్.ఎస్ బోయపాలెం 200, జడ్పీహెచ్ఎస్ సొంట్యం 212, నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పెద్ది పాలెం196 మంది విద్యార్థులు పరీక్ష హాజరు కావలసి ఉండగా 20 మంది గైర్హాజరైనట్లు గుర్తించారు. 1068 మంది విద్యార్థులకు గాను 1048 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు కావలసిన పూర్తి వసతులను ఏర్పాటు చేసి ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ ఎస్.పద్మావతి తెలిపారు. ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా పోలీసులతో ముందస్తు చర్యలు చేపట్టారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - పెందుర్తి: భారతదేశం పురోభివృద్ధి చెందాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముక్క రామునాయుడు అన్నారు. పెందుర్తిలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఇలాంటి ప్రజాస్వామ్య పార్టీలను ప్రజలందరూ ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తనను మండల కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమించిన అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్‌కు, పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు, గిడుగు రుద్రరాజుకు, రాకేష్ రెడ్డి, మల్లికార్జున ఠాగూర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదారి రమేష్ నాయుడు, వేగి దివాకర్ తదితర పార్టీ పెద్దలకు ముక్క రామునాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు.

శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకునికి ఘన నివాళులు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందిస్తున్న శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆత్మకూరి శంకర్రావుకు ఆ సంస్థ డైరెక్టర్ ఆత్మకూరి కృష్ణ కుమార్, జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కె.బంగార్రాజు తదితర ప్రముఖులు సోమవారం ఉదయం ఘన నివాళులర్పించారు. శంకర్రావు 12వ వర్ధంతిని పురస్కరిం చుకుని జీవీఎంసీ 93వ వార్డు నాయుడు తోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆవరణలో గల శంకర్రావు విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్రావు సమాజానికి అందించిన సేవలను వారు ప్రస్తుతించారు. శంకర్రావు స్ఫూర్తితో నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

22 నుంచి ఇసుజు ఐ-కేర్ 'సమ్మర్ క్యాంప్'

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఉత్తమ సేవ యజమాని అనుభవాన్ని అందించుటకు ఇసుజు యొక్క నిబద్ధతను తిరిగి ధృవీకరించే తన నిరంతర ప్రయత్నములో, ఇసుజు మొటార్స్ ఇండియా తన ఇసుజు డి మ్యాక్స్ పిక్ అప్స్ ఎస్‌యూవీల శ్రేణి వాహనముల కొరకు ఒక దేశ-వ్యాప్త 'ఇసుజు ఐ-కేర్ 'సమ్మర్ క్యాంప్' ను నిర్వహించబోతోందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. వినియోగదారులకు అద్భుతమైన ప్రయోజనాలను దేశములో ఈ వేసవిలో సమస్యా-రహితమైన డ్రైవింగ్ అనుభవము కొరకు ప్రెవెంటివ్ మెయింటెనెన్స్ చెకప్స్ అందించాలనేది ఈ సర్వీస్ క్యాంప్ ఉద్దేశమన్నారు. 'ఇసుజు కేర్' యొక్క ప్రయత్నములో భాగంగా 2023 మార్చ్ 22 నుండి 29 వరకు అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్లెట్స్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహించబడు తుందన్నారు. సర్వీస్ బుకింగ్ కొరకు సమీప ఇసుజు డీలర్ అవుట్లెట్ లేదా 1800 4199 188 (టోల్-ఫ్రీ) నంబరుకు కాల్ చేయవచ్చునని తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

విశాలాంధ్ర - ఆనందపురం: మహిళలకు పౌష్టిక ఆహారము వాటి విలువలపై పాలవలస గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడిలోవ ఏక్యూజె కళాశాల ఆధ్వర్యంలో పాలవలస గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎస్ పిఓ పవన్ కుమార్ మాట్లాడుతూ పాలవలస గ్రామంలో వారం రోజులపాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు ఇందులో భాగంగా సోమవారం పాలవలస లో పాఠశాల విద్యార్థులకు మహిళలకు పౌష్టికాహారం వాటి విలువ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు, మహిళలకు శానిటరీ పాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పివో పవన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్‌రైస్ హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖ వాసులైన అమూల్య, ఉతేజ్ దంపతులు విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌లో ట్రాకియ ఇసోఫేజియల్ ఫిస్టుల, ఇసోఫేజియల్ ఎట్రిసియా అనే అరుదైన వ్యాధితో ఆడబిడ్డ జన్మించింది. ప్రతి 3500 మంది పుట్టిన శిసువుల్లో ఒకరికి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి లో గాలిగొట్టం, అన్నవా వాహికకు మధ్య పిస్టల కనెక్షన్ ఉంటుంది. మరియు అన్నవాహిక జీర్ణకోసానికి మధ్య ఎటువంటి కనెక్షన్ ఉండదు. ఇటువంటి సమస్య ఉన్నాపిల్లలు ఆపరేషన్ చేయకపోతే బ్రతికే అవకాశం ఉండదు. ఇటువంటి క్లిష్ట మైన సమస్య గల శిశువు గాజువాకలో సన్ రైస్ హాస్పిటల్ వారు ముందుఅడుగు వేసి హాస్పిటల్ లో అడ్మిట్ చేసుకున్నారు. పిల్లల వ్యాది నిపుణులు అయిన డాక్టర్ తిరుపతి , డాక్టర్ గణేష్ మరియు పిల్లల నిపుణులు డాక్టర్ రమణ, అనిస్తిశియా నిపుణులు డాక్టర్ లక్ష్మి తల్లితండ్రులతో ఈ వ్యాధి గురుంచి చర్చించి, ఎంతో నిపుణులతో ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 35 రోజులు వెంటిలేటర్‌పైన ఉంచి వైద్యం అందించారు. ఈ ఉపిరితితులు లో ఇన్ఫాక్షన్ న్యూమోతెరాక్ష్ , సేప్టీసిమియా , హైపోటెక్షన్ చాల సార్లు ఎక్స్టుబేషన్ వైఫల్యం లారింగోమిసేమియా రక్తహీనత వంటి ఎన్నో ఇబ్బందులు ను ఎదుర్కొన్నారు. అంతే కాకుండా దాదాపు 31 రోజులు సి పి ఎ పి మెషీన్ ద్వార బిడ్డ కు అందించారు. తరువాత బిడ్డలకు తల్లిపాలు ఇవ్వటం ఒక పెను సవాలుగా మారింది. డాక్టర్ తిరుపతి , డాక్టర్ సతీష్ , డాక్టర్ నవీన్ , డాక్టర్ ప్రతిభ మరియు నర్సులు సిబ్బంది ఎంతో కృషి వలన బిడ్డకు తల్లి పాలు ఇవ్వడంలో వచ్చే ఇబ్బందులను ఎంతో సులువుగా ఎదుర్కొన్నారు. ప్రతి రోజు బిడ్డ పరిస్థితి గురుంచి తల్లితండ్రులుకు వివరిస్తూ వారిలో మనోధైర్యం నింపారు. ఇటువంటి సమస్య కు కార్పొరేట్ హాస్పిటల్ లో సుమారు 25 నుండి 35 లక్షలు వరకు కర్చు అయ్యే అవకాశం ఉంది. అటువంటి ఈ హాస్పిటల్ లో

అతి తక్కువ కర్చుతో వైద్యం అందించారు. మానవతా దృక్పథంతో తల్లితండ్రులు, హాస్పిటల్ యాజమాన్యం వారు ఆర్థిక సహాయం అందించారు.

ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి అంశంపైనా సంపూర్ణ అవగాహన కల్పించుకొని విధులు సక్రమంగా నిర్వర్తించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన వివిధ మానిటరింగ్ కేంద్రాలను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి ఇతర నిబంధనల గురించి విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముందుగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్, వెబ్ కాస్టింగ్ రూమ్ ను పరిశీలించారు. అనంతరం 104 కాల్ సెంటర్ రూములో ఏర్పాటు చేసిన 24ల7 పని చేసే కాల్ సెంటర్ను పరిశీలించి అక్కడివారికి తగిన సూచనలు జారీ చేశారు. రెండో అంతస్తు అదే వరుసలో ఏర్పాటు చేసిన ఎం.సి.ఎం.సి. (మీడియా సర్టిఫికేషన్ %డ% మానటరింగ్ సెల్), కంప్లైంట్ నమోదు కంద్రాన్ని సందర్శించారు. తర్వాత కింద అంతస్తులో ఏర్పాటు చేసిన సింగిల్ విండో కేంద్రం, బడ్జెట్

ఎక్స్‌పెండేచర్ కేంద్రం, మీడియా, సోషల్ మీడియా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ వివిధ సూచనలు జారీ చేశారు. ప్రతి కేంద్రంలో ఉండే సిబ్బందికి వారి విధులు, ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన కల్పించాలని వీలుంటే శిక్షణ అందించాలని ఎన్నికల సెల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏవో బీఎస్ దేవ్ ప్రసాద్, నోడల్ అధికారులు, ఎన్నికల సెల్ అధికారులు తదితరులు ఉన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా పది పరీక్షలు

-ముగ్గురు విద్యార్థుల డిబార్

విశాలాంధ్ర - విశాఖ సిటీ/విశాఖ కలెక్టరేట్: సోమవారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు విశాఖ జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 29,040 మంది పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 28,67 3 మంది హాజరయ్యారు. 3 67 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఎ.పి. ఓపెన్ స్కూల్ ఎస్.ఎస్.సిలో 909 మంది విద్యార్థులకు 832 మంది విద్యార్థులు హాజరయ్యారు. 77 మంది హాజరుకాలేదు. ఎ.పి. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్లో 1062 మంది విద్యార్థులకు 977 మంది విద్యార్థులు హాజరైనారు. 85 మంది హాజరుకాలేదు. జిల్లా అబ్జర్వర్, ప్రాంతీయ పాఠశాల సంయుక్త సంచాలకులు బి.విజయ భాస్కర్ రెండు సెంటర్లు, జిల్లా కలక్టర్ డా.ఎ. మల్లికార్జున ఒక పరీక్షాకేంద్రాన్ని జిల్లా విద్యాశాఖా ధికారిణి ఎల్.చంద్రకళ నాలుగు పరీక్షాకేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 50 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదని జిల్లా విద్యాశాఖా ధికారిణి ఎల్.చంద్రకళ తెలియజేసారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భీమిలి నందు ఒక విద్యార్థి, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల, భీమిలిలో ఇంటర్మీడియ ఒక విద్యార్థి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తోటగరువు లో ఒక విద్యార్థి, మొత్తము 3 విద్యార్థులను డిబార్ చేసారని ఆమె తెలిపారు.

మాకొద్దీ వంశీకృష్ణ

- దక్షిణ జనసేన నాయకులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జన సేన గెలుపే ధ్యేయంగా స్థానికంగా ప్రజల్లో వున్న నాయకులకు అవకాశం ఇవ్వాలని 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్, దక్షిణ జనసేన నాయకుడు మూగి శ్రీనివాస్ కోరారు. డాబాగార్డెన్స్ వైజాగ్ జర్నలిస్టు ఫోరంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ అధినేత నిర్ణయం శిరోధార్యమని, ప్రజల మనో భావాలు పరిగణలోకి తీసుకుని అభ్యర్థి ప్రకటించాలన్నారు. పక్క నియోజక వర్గంలో పనికి రాని అభ్యర్థిని దక్షిణంలో రుద్దడం సరికాదనీ, పార్టీ లో కష్టపడిన మత్స్య కారులు, మైనారిటీలకు టికెట్ ఇస్తే బాగుంటుందన్నారు. వంశీ పట్ల ప్రజలు సుముఖంగా లేరని తెలిపారు. అనకాపల్లి తప్ప మిగిలిన నియోజక వర్గాల్లో అభ్యర్థుల ప్రకటన జరగ లేదు అని స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ, జన సేన పొత్తు తో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. స్థానికేతరులను ప్రజలు ఆదరించరన్నారు. గత 15 ఏళ్లుగా ప్రజల్లో వున్న నాయకులకు టికెట్ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. వంశీ కృష్ణ శ్రీనివాస్ తానే అభ్యర్థి అని ప్రకటించుకున్నారు. ఆయన తూర్పు నియోజక వర్గం నాయకుడని, 50 వేల ఓట్ల తేడాతో వెలగపూడి చేతిలో వోడి పోవడం విశాఖ ట్రాక్ రికార్డ్ అని ఎద్దేవా చేశారు. సమావేశంలో జన సేన నాయకులు మెడి శెట్టి రమణ, వెంకట రావు, దేముడు, రూప, తులసి, కనక మహాలక్ష్మి, అబిద, రమ, నాగ రత్నం, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

యతిరాజులకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన యతిరాజుల నాగేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తుతు న్నాయి. జీవీఎంసీ 94 వార్డు పరిధిలోని పలు కాలనీలకు చెందిన వైసిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో నాగేశ్వరరావు నివాసానికి చేరుకొని శాలువాలు పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఆయన సమాజానికి అందించిన సేవలను పార్టీ కోసం కష్టపడిన తీరును వారు ప్రస్తుతించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమం సమపాలల్లో పాలన సాగిస్తూ నభూతో న భవిష్యత్తు అన్న విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు.

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తనకు రాష్ట్రస్థాయి పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి జీవితాంతం కృతజ్ఞుడునై ఉంటానని స్పష్టం చేశారు. పెందుర్తి నియోజకవర్గంలో వైసీపీలో తొలి అడుగు వేసిన తాను చివరి వరకు ఆ పార్టీ పురోగతి కోసం అహర్నిశలు పాటుపడతానని పేర్కొన్నారు.

పీవీఆర్ ఐనాక్స్ పాస్‌పోర్ట్

- 4 సినిమాలు కేవలం రూ.349 మాత్రమే

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారతదేశపు అతిపెద్ద మల్టీప్లెక్స్ చెయిన్ అయిన పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్ తన నెలవారీ సినిమా సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ పాస్‌పోర్ట్ రెండో ఎడిషన్‌ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది విలువైన వినియోగదారుల అభిప్రాయం ఆధారంగా రీడిజైన్ చేయబడిందన్నారు. ఇప్పుడు దక్షిణ భారత రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న పాస్‌పోర్ట్ మరింత వినియోగదారులతో స్నేహపూర్వకంగా ఉంటుందన్నారు. ఉత్తేజకరమైన కొత్త ఫీచర్లు, తక్కువ షరతులతో లోడ్ చేయబడిందన్నారు. మార్చి 18వ తేదీ నుండి, చందాదారులు సరసమైన ధరలో చలన చిత్రాలను చూసే అవకాశం ఉంటుందనీ, సోమవారం నుండి గురువారాల వరకు, చందాదారులు నెలకు 4 సినిమాల వరకు కేవలం రూ.349లకే చూడవచ్చన్నారు. పాస్‌పోర్ట్ ద్వారా మరొకరికి టి క్కెట్‌లను కొనుగోలు చేసి రీడీమ్ చేసుకునే అవకాశం కూడా చం దాదారులకు ఉందని తెలియజేశారు. సబ్‌స్క్రైబర్‌లు రిక్లైనర్‌లపై లేదా ఐ మ్యాక్స్, పి (ఎక్స్ ఎల్), ఐసీఈ, స్క్రీన్ ఎక్స్, ఎమ్ ఎక్స్ 4డి, లేదా 4డి ఎక్స్, వంటి ప్రీమియం ఎక్స్ పీరెన్షియల్ ఫార్మాట్‌లలో చలనచిత్రాలను చూడాలను కుంటే, వారు పాస్‌పోర్ట్ కూపన్‌పై అదనంగా రూ. 150 రుసుము చెల్లించాలన్నారు.

తద్వారా అంతకంటే ఎక్కువ ఆనందించే అనుభవాన్ని పొందవచ్చను తెలియజేశారు. పీవీఆర్ ఐనాక్స్ పాస్‌పోర్ట్ 2.0 ప్రారంభం గురించి పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్ సహ-సీఈఓ గౌతమ్ దత్తా మాట్లా డుతూ, "మా పీవీఆర్ ఐనాక్స్ పాస్‌పోర్ట్ మొదటి ఎడిషన్ సినీ ప్రేక్షకుల నుండి చాలా ప్రేమాభిమానాలను, ప్రశంసలను పొందిందన్నారు. ఇది పూర్తిగా వినియోగదారులకు అనుకూలమైనది, ధర-ఘర్షణ సవాలును అధిగమిస్తుందన్నారు.

మన దేశంలో సినిమా అల వాట్లను నిజంగా మార్చడానికి మాకు వీలు కల్పిస్తుందన్నారు. ప్రేక్షకులను మరిన్ని జానర్‌ల నుండి మరింత కంటెం ట్‌ను అన్వేషించడానికి వీలు కల్పించేటప్పుడు, ఇలాంటి ప్రతిపాదన పెద్ద లేదా చిన్న సినిమాలకు ఎక్కువ మంది ప్రేక్షకులను తీసుకురాగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు.

యాజమాన్యం కక్షసాధింపు తగదు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గంపై యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఇది మంచి పద్ధతి కాదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కార్మికులను భయ బ్రాంతులకు గురిచేసే విధంగా యాజమాన్యం ప్రవర్తిస్తుందన్నారు. ఉక్కు ఉత్పత్తికి కావాల్సిన వనరులను సమకూర్చాల్సిన యాజమాన్యం ఇవేమి పట్టించుకోకుండా కార్మికులపై దాడులకు దిగుతుందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు తప్పవన్నారు. తృష్ణా మైదానంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ విజయవంతమైందన్నారు. ఇందుకు సహాకరించిన ప్రతి ఒక్క ఉద్యోగి, కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పోరాటాలు చేద్దామన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, డి.మోహన్, ఎంఎస్ఆర్.ప్రసాద్, కోరాడ వెంకటరావు, పీవీ.నగేష్, గంగవరం గోపి పాల్గొన్నారు.